
# కలలు నిజం అవుతాయా?



శాంతి కృష్ణమూర్తి

నిడదవోలులో మెయిలు దిగి, మెయిల్ డూప్లికేట్ మీద తిన్నగా పోలవరం చేరాం. స్టేషన్‌లో స్వామినీ, నన్నూ చెరుకువాడ ఆహ్వానించాడు. ప్రపంచకంలోకల్లా రెండవ పెద్ద ప్రాజెక్టయిన రామపాదసాగర్‌ని చూడ్డానికి యాత్రీకులుగా వచ్చాం, మేం. రాజమండ్రీ కంటే పెద్దదిగా మారిన ఈ నగరాన్ని చిన్నప్పుడు చూసిన చిన్న పల్లెటూరుతో పోల్చిచూస్తుంటే నాకు ఆనందోద్రేకంతో పరవశుణ్ణవుతున్నట్టుంది. చిన్న గుడిసెలన్నీ పెంకుటిళ్ళుగానూ, పెంకుటిళ్ళన్నీ పెద్ద మేడలుగానూ మారి, ఆకాశాన్నంటుతాయా అనిపిస్తున్నాయి.

స్టేషన్ పరిసరాల్లో సౌకర్యంకోసం బయలుదేరిన సిమ్మెంటు ఫాక్టరీలు, పేపరు మిల్లులూ, బట్టల మిల్లులూ ఎడతెగని పోరుచేస్తో, 'అంత శ్రమా ప్రజావసరాల్ని తీర్చడానికే' అని అరుస్తున్నట్టున్నాయి.

బజారులోంచి కారు పోతోంది. విదేశంలో నలుమూలలనించి వచ్చిన వ్యాపారస్థుల దుకాణాల్తో, జనసమ్మర్దంతో నిండి విశాలమైన వీథులలో ఉన్న బజారుని చూస్తుంటే, చిన్నప్పుడు నిత్యావసరాలైన సరుకులకే కరువైన చిన్న దుకాణాలు, మా స్టోర్సు గుర్తొచ్చి నాలో నాకే నవ్వొచ్చింది.

'ఈయనే చెరుకువాడ. ఈయన ప్రత్యేకతేమిటంటే కేపిటలిస్టూ, కమ్యూనిస్టూ, జర్నలిస్టూ, ఆర్టిస్టూ' అన్నాను.

'మొదటి రెండూ ఎలా సాధ్యం' అన్నాడు స్వామి. చెరుకువాడ నవ్వుని ఆపుకుంటున్నాడు.

'కలప వ్యాపారంద్వారా కేపిటలిస్టూ, ఆయన భావాలద్వారా కమ్యూనిస్టూ' అన్నాను.

ముగ్గురం నవ్వాము. కారుని కాలనీలోనించి పోనిస్తున్నాడు చెరుకువాడ.

'మీ బిజినెస్ ఎలావుంది?' అన్నాను మళ్ళీ. మాకోసం అతను స్టేషన్‌కు తెచ్చినకారే అతని వ్యాపారాభివృద్ధికి తార్కాణం. అలాంటప్పుడు నా ప్రశ్న అనవసరం. అతను చిరునవ్వునే సమాధానంగా ఇచ్చాడు. నేనూ నవ్వాను, బదులు నవ్వు.

అక్కడ పనిచేసే ఇంజనీర్లకోసం అధునాతన పద్ధతుల్లో కట్టబడింది, ఈ కాలనీ.

'ఇదే రామ్మూర్తి నగర్. ఈ ప్రాజెక్టు తయారవడానికి కారణభూతమైన ఆయన పేరు ఆయన్ని గౌరవించడంకోసం, ఈ కాలనీకి పెట్టారు' చెరుకువాడ అన్నాడు.

'ఇవన్నీ కాలినడకని చూస్తేనో?' అన్నాడు స్వామి.

'ఇప్పుడొద్దు! ఆనక సాయంత్రం తీరిగ్గా చూద్దురుగాని. అయినా మీరు ప్రయాణపుబడలికతో అలిసినట్టున్నారు కూడాను' అన్నాడు చెరుకువాడ. నేనూ తలూపాను.

చివరికి పాతపోలవరం చేరాం. చెరుకువాడ ఇల్లు తక్కిన చాలాయిళ్ళల్లానే పెద్ద మేడయింది. ఇల్లంతా విద్యుచ్ఛక్తిమయమై, అద్భుతంగా ఉంది. 'అసలే అలిసివున్నాను— దీని మెట్లన్నీ ఎక్కాలిగావునురా దేవుడా' అనుకుంటున్న నాకు ఎలక్ట్రిక్ లిఫ్టులు తీరనిసహాయం చేశాయి. మేడమీద ఓగది మాకోసం ప్రత్యేకించాను. ఆ మేడ విశిష్టత ఏమి

టంటే దానిమీదనించుంటే ఇవతల గోదావరీ, అవతల డామ్, తెరచాపపడవలూ, చుట్టుపక్కలి పర్వతాలూ అన్నీ కనపడతాయి.

"నేను గర్వంకోసం అనడంలేదు. ప్రజోపయోగానికి విద్యుచ్ఛక్తి ఎన్నివిధాల పనికొస్తుందో అన్నివిధాల మాయింట్లో ఉపయోగిస్తున్నాం. అంటే మాదొక 'మోడల్ హౌస్' అన్నమాట!" అని గర్వంతో అన్నాడు చెరుకువాడ.

మేడమీంచి కుడివైపుకు చూస్తే చిన్నతోట కనపడుతోంది. అక్కడ ఎంతోమంది చిన్న పిల్లలు ఉయ్యాల లూగుతున్నారు; చిన్నరైళ్ళలో ప్రయాణాలు చేస్తున్నారు; రంకుర్రాట్నంమీద తిరుగుతున్నారు; వింతబొమ్మల (నవ్వేవి, పరుగెత్తేవి, ఆడేవి) తో ఆడుతున్నారు. ఒక నిమిషం కన్ను లప్పగించి చూశాను.

'మీకు తెలుసుకదూ, నాకు చిన్న పిల్లలంటే ఎంతయిష్టమో? వాళ్ళకోసమే ఇక్కడ చిన్న పార్కులా కట్టించాను. బీదవాళ్ళ పిల్లల్నికూడా యథేచ్ఛగా అన్నీ అనుభవించనిచ్చేలా తోటమాలికి చెప్పాను; వాళ్లకూడా ఆనందాన్ని సమంగా అనుభవించేలా. ఇది మీకు వింతకాదేమో—అవన్నీ విద్యుచ్ఛక్తిమీదే నడుస్తున్నాయనేది వినడం.'

నాలాగే, స్వామికూడా నిశ్శబ్దప్రేక్షకస్థానం ఆక్రమించాడు.

నీళ్లు కాగడం, వంట తయారవడం, జల్లించబడ్డం, చల్లచెయ్యడం అన్నీ విద్యుచ్ఛక్తిమీదే! అన్నీ సావకాశంగా చూడసాగాం. మా ఆనందానికి అంతులేదు.

సంతోషం పట్టలేక చివరికి: 'ప్రాజెక్టు కట్టవద్దనడానికి కారణాలుగా, ఇక్కడ తయారయ్యే విద్యుచ్ఛక్తినంతనీ మనప్రజ లుపయోగించుకోరనీ, అందువల్ల నష్టం కలుగుతుందనేది ఒక సాకుగా చెప్పేవారు పూర్వం' అన్నాను నేను.

'అవును. కాని ఇప్పుడు చవగ్గా లభించే విద్యుచ్ఛక్తివల్ల మానవశ్రమ ఎంతో మిగిలి కార్మికవర్గానికి, స్త్రీలకీ ఎంతో తీరికకలిగి వాళ్ళ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునేందుకు వీలవుతోంది' చెరుకువాడ అందుకుని అన్నాడు.

తర్వాత భోజనాలు అన్నీ ముగించుకున్నాం.

నాలుగుగంటలకి అతని కారుమీదే లాంచిరేవుకి వెళ్లాం. 'స్వతంత్ర భారత్' అనే అతని లాంచీలో అవతలిగట్టుకు వెళ్ళి లాకుల్ని దాటుకుని సాగర్‌మీదికి వెళ్ళాం. ఎంతోఎత్తు లేచినట్టుంది. దృశ్యాలన్నీ చూస్తుంటే నాకు వొళ్ళు జలదరించింది. చిన్న గోదావరిలా ఉండేది ఇదివరకు-ఇప్పుడో పెద్ద సరస్సులా, అంతులేని సముద్రంలా వుంది, రిజర్వాయర్.

పేపర్‌మిల్లులకోసం, తక్కిన అవసరాలకోసం వొచ్చే కలపవర్తకుల, చేపలవర్తకుల నావలతోనూ. ప్రయాణీకుల స్టీమర్ల, లాంచీలతోనూ నిండిన రామపాదసాగర్; పైనించి పడులో కృత్రిమజలపాతంద్వారా విద్యుచ్ఛక్తిని తయారుచేసే, నిరంతఘోషపెట్టే రామపాదసాగర్; కులాసాగా షికారుచేసే దంపతుల లాంచీలతో, షికార్లు చేసే విద్యార్థుల బోట్స్‌తో నిండిన రామపాదసాగర్—మాటలు చాలడంలేదు వర్ణించడానికి. ఒక ప్రపంచకాన్ని, అందమైన వింతవాతావరణాన్ని సృష్టించుకున్నట్టు వుంది.

'ఇందుకేగావును - రావుగారూ, రామ్మూర్తిగారూ రామపాదసాగర్‌కోసం అంతగా కలవరించింది' అనుకున్నాను, నాలో.

కుడివైపున స్లూస్ చూసి, తర్వాత ఎడమవైపున సబ్సిడరీ డామ్‌నీ, ఎడమవైపు కాలవలు పోయే టనెల్‌నీ చూసి, లాంచిని లాకులదగ్గరికి మళ్ళించాం.

అక్కడికి చెరుకువాడ కారు వచ్చింది. డామ్‌మీది రోడ్డుమీంచి కారులో ప్రయాణం చేయసాగాం. ఒకపక్క జలపాతం, మరోపక్క మహాసాగరం. మాఆనందాన్ని ఊహించుకోవలసిందే.

దాని తర్వాత కుడివైపున కొండమీదవున్న 'ఎలక్ట్రిక్ హౌస్' చూశాం.

'మీలో నదిలోస్నానంచెయ్యడానికి యిష్టపడుతున్నది ఎవరు?' అన్నాడు చెరుకువాడ.

'నేను' అన్నాడు స్వామి.

నావైపు చూశారు, తర్వాత.

'పదండి' అన్నాను.

అక్కడ స్నానాలరేవులో ఎంతోమంది స్నానాలు చేస్తున్నారు - పురుషులూ, స్త్రీలూ. నాకు మద్రాస్‌లోని 'ఇలియట్ బీచ్' జ్ఞాపకానికి వొచ్చింది.

నేను స్వామికిబకులు చేపలు పట్టడానికి గేలం తీసుకున్నాను, పరదాకి-స్నానం మానేసి.

కాని...నా తల్లో ఏవో రైళ్ళు పరుగెడుతున్నాయి, విమానాలు ఎగురుతున్నాయి. చాలా మంది నా మిత్రుల్లా, ఈ గొప్ప ప్రాజెక్టులో చివరి వరకూ పనిచేద్దా మనుకున్నాను, నేనుకూడా. కారణాంతరాలవల్ల అది సాధ్యం కాలేదు. అందుకే ఈ మహోద్యమంలో, ఈ గొప్ప ప్రాజెక్టు నిర్మాణంలో పాల్గొనలేకపోయానే అన్న చింతతో, వ్యథతో, ఆలోచనతో తల తిరుగుతోంది. స్వామీ వాళ్ళూ ఈదుతూ 'పిరికి' అంటున్నారు, నన్ను చూసి. వాళ్ళల్లో వాళ్లు నవ్వుకుంటున్నారు. నాలో అశాంతి ఎందుకనో రేచ్చిపోయింది. నన్ను నేనే శాంతిపర్చుకో లేకపోయాను.

చప్పున నీటిలో ఉరికాను. చెప్పలేనంత అగాధం. సబ్ మెరైన్‌లా లోపలికి పోతున్నాను. కొంచెంగా ప్రవేశిస్తున్న సూర్యకాంతిలో తెల్ల తెల్లగా మెరుస్తున్న పెద్ద చేపలూ, తిమింగలాలూ పరుగులు పెట్టడం; పెద్దవి చిన్నవాటిని తరమడం, తినడం- అన్నీ వింతగా చూస్తూ లోపలికి పోతున్నాను. మనసు శాంతిస్తోంది. అంతా చూస్తుంటే ఇంగ్లీషు సినిమాల్లోని జలాంతర్గత ఛాయాచిత్రగ్రహణంలా వుంది. కిందకి వెళ్ళి కూచున్నాను.

రెండుక్షణాలు నిర్మలమైన శాంతిలో, గొప్ప ఆనందంలో గడిచాయి!

గుక్క ఆగిపోయింది; పైకి తేలి పోసాగాను. కాని అనంతం...ఎంతగా పైకి వొచ్చినా గాలి దొరకలేదు. ఉక్కిరిబిక్కిరి అయింది.

'గాలి, గాలి' అని అరవబోయాను ఒకటి, రెండు, మూడు...గుటకలు.

'గాలి, గాలి !' అని అరిచాను, పైకే. నిద్ర మత్తులో కూడా స్పష్టంగా వినబడింది. రాజేశ్వరి పరుగెత్తుకొచ్చింది.

'తెస్తున్నాను.'

'ఏమిటి ?' పడకకుర్చీలో లేచికూచున్నాను.

" 'కాఫీ' అని అరిచారు కదూ ?"

నాకు నవ్వొచ్చింది. 'లే !' అన్నాను— లోపల ' ప్రభుత్వందగ్గర డబ్బు లేదుట. మనం సామాను సర్దుకోవచ్చులే' అనుకుంటూ.

రామపాదసాగర్ స్వాప్నిక చిత్రం కరిగి పోయింది...

# ★ కాంగ్రెసు సేవాదళం పుట్టుపూర్వోత్తరాలు ★

★ దరువూరి వీరయ్య ★

కడచిన డిసెంబరు 25 వ తేదీన యావత్తు భారత దేశంలోను జాతీయ కాంగ్రెసు యాజమాన్యమున రజతోత్సవము జరుపుకొన్న అఖిల భారత కాంగ్రెసు సేవాదళం ఆంధ్రంలో జన్మించినది. ఆంధ్రలో ప్రారంభించుటయే కాదు. కీర్తిశేషులైన ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి రామదండు, నేడు భారతదేశ మంతటా విస్తృతంగా లక్షలాదిగా నిర్మాణమైయున్న కాంగ్రెసు సేవాదళ శాంతి సైనికులకు ప్రాతిపదిక.

నాటి మన ఆంధ్రరత్న ' రామదండు ' నిర్మించడంలో చేసిన కృషి నేటికి కాంగ్రెసు సేవాదళముల పేర శాంతి సైనికుల తయారుచేసి విస్తృత ప్రజా సేవ చేయుటఆయనకొక స్మారకచిహ్నమునక తప్పదు.

## సేవాదళం — రామదండు

విజయవాడలో 1921 లో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెసు సమావేశమునకువచ్చిన జాతీయనాయకులను చూచి, వారిచ్చే సందేశములందుకొనుటకై ఆంధ్రలోని వివిధ ప్రాంతముల నుండి లక్షలాదిగా ప్రజలు వచ్చారు. ఆ ప్రజా సామాన్యము క్రమశిక్షణ తెలియక ఒకరిపై ఒకరు విరగబడి నానావస్థలు పడడం చూచిన ఆంధ్రరత్న వెంటనే తాను నిర్మాణముచేసిన రామదండు చేత జనసామాన్యము నంతటిని నిర్మాణయుక్తంగా బారులు బారులుగా కూర్చుండపెట్టి రహదారులు వెంట నాయకులను నడిపించుట ద్వారా ప్రజల నానందింపచేశారు.

ప్రజలు, నాయకులు ఆంధ్రరత్నయొక్క ఆదర్శకృషికి తమ కృతజ్ఞత